ఉంగరం

అమ్మయ్యా! ఈ రోజుతో తన కష్టాలన్నీ ఫలిస్తాయి. దేనికైనా ధైర్యం ఉండాలి. ఎటువంటి అద్భుతమైన ఆలోచన తట్టింది తనకి! ఎలాగ మెరుస్తోంది తన అందమైన వేలికి!.... ఇంక దీనితో తాను బతుకుని కొత్తగా తీర్చుకోవాలి. సుఖంగా దర్జాగా జీవితం గడపాలి ఇంత వరకూ తానెంత నీచంగా బతికింది తలుచుకుంటేనే అసహ్యంవేస్తోంది. అంట్లు తోమడం, గదులూడ్చడం, వాళ్ళిచ్చే పాసిపోయిన అన్నంతోపాటు తిట్లనీ శాపనార్ధాల్నీ మూటకట్టుకుని నిస్సహాయతతో ఉడుకుమోతు తనంతో యింటికి వెళ్ళడమూ–అక్కడ తల్లి రోగంతో మంచం మీద బల్లిలాగా అంటుకుపోయి తాను ఆలస్యంగా వచ్చినందుకు ఇంకా తిట్టడమూ–తన గుడిసెలో దుమ్మూ. పొగా, చీకటి. గుడిసె బయట పందులూ, రొంపీ, వాసనా, తన వొళ్ళంతా చాకిరితో నొప్పులూ – ఏడుపొచ్చేది తనకి! చచ్చిపోవాలనిపించేది. అందరిలాగా తాను హాయిగా కులాసాగా ఎందుకు బతకకూడదు? పంతులమ్మ కూతురులా సిల్కు–వోణీలు తన కెందుకుండవూ? రవణమ్మ బుగ్గలూ వొళ్ళూ ఎలా నిగనిగ లాడుతుంటాయో–రెండుపూటలా మీగడా పెరుగూ వెన్నపూసా వేసుకొని తింటుంది కదూ! తన యీడుదే వరహాలు మరి–రోజూ తల్లో పువ్వులు పెట్టుకుని కాటుక పెట్టుకుని సినిమాకు వెళుతూంటుంది మొగుడితో. మరి తనకి పువ్వులూ సినిమాకి డబ్బులూ ఎప్పుడూ వుండవు. మరి మొగుడూ లేడు!

తనలో ఎన్ని కోరికలు! ఎన్ని కలలు! చిన్నప్పట్నుండీ తన కెందుకో ఎగిరిపోవాలనీ, పాటలు పాడాలనీ నాట్యం చెయ్యాలని ఎన్నో

ఎన్నో - పొలంగట్టుకాడ కూర్చుని సినిమాపాటలు పాడుతుంటే తన కేసి అందరూ చూచి నవ్వేవారు. తనని వెర్రిదనేవారు. ఏమిటో తన వెర్రి! మంచిబట్టలు కట్టుకోవాలనీ, షోగ్గా సింగారించుకోవాలనీ హాయిగా బతకాలనీ ఎవరనుకోరు? వాళ్ళకి డబ్బు యిల్లూ ఉన్నా ఎంత అసహ్యంగా బతుకుతారు. ఎంత లేకిగా వుంటారు! వడ్డాణమూ కాసుల పేరూ పెట్టుకుని తిరుగుతుంది అమ్మగారు. 'అమ్మా, ఈవాళ తిరణాల ఓ బేడ డబ్బు లివ్వండి' అని అడిగితే దండకం చదువుతుంది ఆవిడ. 'నా దగ్గర ఏం ఒలకడంలేదు ముష్టిముండాపీనుగని ఒక్క అణా డబ్బులుకూడా నా కివ్వరు. తాళికట్టాడు కాబట్టి యిలా బతుకుతున్నాను కుక్కిన పేనులాగ. ఈయన్ని ఈయన డబ్బునీచూచి పీక కోశాడు మా నాన్న '....అబ్బబ్బ వినలేక వచ్చేస్తాను. యివ్వకపోతే మానె. ఇంత అఘాయిత్యంగా మాట్లాడుతుందేఁవిటీ; అయ్యగారు ఊళ్ళో లేనప్పుడు ధాన్యం చాటుగా అమ్మించి డబ్బు దాచేసుకుంటుంది నాకు తెలీదని ఆవిడ ఉద్దేశం! పోనీ అయ్యగారిని అడిగితే ఆయన ఒకటే తిట్లు. 'ఈగది సరీగా ఊడవలేదేం! వెధవ పనితనం నువ్వూ. పైగా డబ్బులు కావాలిట! మీ అమ్మ నిరుడు వైద్యానికి మూడు రూపాయలు తీసుకు వెళ్ళింది. ఇంక తీర్చడంమాట ఉత్తిదే. అయినా తిరణాల కెందుకే నీకు? వెధవ చిరుతిండి తింటానికా! రెండుపూటలా తింటున్నావు చాలదూ.'

ఉక్రోషం వచ్చేది తనకి! తనదగ్గరే డబ్బులుంటే 'ఏడవకయ్యా. ఈ రూపాయి తీసుకుని తిరణాలకెళ్ళి నువ్వే కొనుక్కో' అని యిచ్చేసును. ఇవ్వనంటే పోయేది యింతంత మాట లెందుకో!

తనకి అందం లేదా! తెలివితేటలు లేవా! సుబ్బయ్యగారి గదిలో ఎవరూ లేనప్పుడు అద్దంలో తన మొహాన్ని చూచుకొనేది. ఎంత అందంగా ఉంది తన మొహం - నిగనిగలాడే వొళ్ళూ, మెరిసే కళ్ళూ, బుగ్గమీద సొట్టా - వాళ్ళ అచ్చెమ్మకన్న వెయ్యిరెట్లు నయం. కొంచెం సబ్బుపెట్టి మొహం తోముకుని పువ్వులరైక తొడుక్కుంటే అచ్చెమ్మ

డీలా అయిపోదూ! చిన్న కళ్ళూ, లావాటి పెదవులు - దాన్నెవడు మనువు చేసుకుంటాడూ! డబ్బుని చూశా! వెర్రిముండా కొడుకులు. పిల్ల యేపుగా ఊతంగా ఉంటే సరదాకాని డబ్బుతో ఏం మనసు తిరుతుందీ! తిని బలిసిన అచ్చెమ్మకి ఎప్పుడూ సొగసులూ, సొలపులూ. లేవలేదు. కూర్చోలేదు! తనకున్న విలవ వాళ్ళకుందా! తన అందాన్ని ఊరకే తక్కువకి కొనెయ్యవచ్చునని అనుకుంటారు రౌడీ వెధవలు. రోడ్లమ్మట పోతుంటే కోరగా జోరుగా చూస్తారు. సుబ్బయ్యగారి కొడుకు - అదేవిటీ అలా చూస్తాడు? జేబులోంచి వెండి రూపాయితీసి మోగిస్తాడు. చెయ్యి వూపుతాడు. మళ్ళీ భయం. వీధి గుమ్మంలో జోడు చప్పుడవగానే గబుక్కున గదిలోకి దూరి తలుపులు వేసుకుంటాడు. వాళ్ళ బాబు వస్తున్నాడని.

తన వాళ్ళందరిలాగా తనకెందుకో తృప్తివుండదు. రంగురంగుల ఊహలు తన గుండెల్లో కలవరపెడుతుంటాయి. తనకెన్నో కథలు వచ్చును. ఊరవతల గుడికాడ సాధుబాబా ఉండేవాడు. చిన్నప్పుడు తనకి మాంచి కథలు చెప్పేవాడు తెల్లని గడ్డం, ముడతలుపడిన కళ్ళూ పళ్ళూ, చిరిగిన బనీనూ వేసుకుని తన్నెంతో ఆప్యాయంగా చూసేవాడు తాను గొప్పదాని సౌతానని రాజకుమారి నవుతానని చెప్పేవాడు రాజ కుమారులు తెల్లని గుర్రాలమీద ఎక్కి, తనలాంటి అందమైనదానిని చూసి 'ఓహో' అని గుర్రంమీద ఎక్కించెసుకుని తీసుకెళ్ళిపోయి పెళ్ళిచేసేసుకుంటారుట. వాళ్ళకి పెద్ద పెద్ద మేడలు, నౌకర్లు, మాంచి పిండివంటలు, జిగేల్మనే నగలు....

మరి సీతాలుని ఓ అబ్బాయి అలాగే లేవతీసుకుపోయాడు. ఏడాది పోయాక మళ్ళీ వచ్చింది సీతాలు. ఎంత ఎంచక్కావుంది. సిల్కుచీర కట్టుకుంది. బంగారపు గాజులు వేసుకుంది. ఆ అబ్బాయి పట్నం తీసు కెళ్ళి అక్కడ పెళ్ళిచేసుకున్నాడట. వర్తకం చేస్తాడట. ఎంతో డబ్బు లాభం వస్తుందిట!

"నన్నుకూడా తీసుకుపోయేందుకు ఎవడినేనా చూసిపెట్టు సీతాలూ" అని అడిగింది ఆ రోజున. ఎంతో బతిమాలుకుంది.

సీతాలు విరగబడి నవ్వింది. "నేను చూసిపెట్టానా. ఓ యమ్మ యిదేం సోద్దెమే" అంది.

"నాకేం తక్కువ ?" అంది తను ఉక్రోషంగా.

"ఇలాంటి బట్టలు వేసుకుంటే ఎలాగ ? మాంచి పరికిణీ వోణీ కుట్టించుకో. ఆ మొగుడెవడో వాడే వస్తాడులే" అంది సీతాలు.

తనకి మంచి బట్టలు ఎలా వస్తాయి ? పోనీ సుబ్బయ్యగారు. వెర్రిపిల్ల చాలా కాలం నుంచి చాకిరీ చేస్తోందని కొనిపెట్టకూడదూ? ఆయన కూతురు అచ్చెమ్మ ఓచీరె యివ్వకూడదూ ? ఇలాగ అనుకునేది తను. కాని యింత సులువైన ఊహ తట్టనే లేదు ఎప్పుడూ తనకి. సుబ్బయ్య చిన్నకొడుకు బళ్ళోంచి వస్తున్నాడు. వాడి వేలిని ఉంగరం మెరిసింది. వెధవ చిడుం వేలికి ఉంగరం కూడా ఎందుకూ ? వాణ్ణి పిలిచింది. ఈ కబురూ ఆ కబురూ చెప్పి మిఠాయి కొనిపెట్టి ఉంగరం తీసేసుకుంది. కుర్రనాగమ్మ యింటిదగ్గర చెప్పగలడా ? సుబ్బయ్య గారూ, పెళ్ళామూ ఉంగరం యెక్కడో పోయిందనుకుంటారు. ఈ ఉంగరం అమ్మితే ఇరవై రూపాయలేనా వస్తాయి. ఆ డబ్బుతో అందమైన బట్టలు కొనుక్కుని కట్టుకుని వెళుతూంటే మాంచి రాజకుమారుడు లాంటి కుర్రాడు తన్ని చూసి 'ఏయ్ అమ్మాయి' అని నవ్వుతాడు. అదోలా, పెళ్ళికొడుకులు నవ్వినట్టు నవ్వుతాడు. అప్పుడు....

అయినా తను అందర్నీ నమ్మకూడదు. మంచివాణ్ణీ, డబ్బున్న వాడినీ ఏరుకోవాలి. దొరలాగా వుండాలి వాడు. 'నిన్నే నమ్ముకుంటాను. నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నువ్వులేందే బ్రతకలేను లచ్మీ" అనాలి. అప్పుడెంచక్కా వాడిని పెళ్ళిచేసుకుంటుంది. సీతాలులాగా పట్నం వెళ్ళిపోతుంది. ఎప్పుడేనా సుబ్బయ్యగారు యిటువస్తే తనని చూసి 'అబ్బో' అని ముక్కుమీద వేలేసుకుంటారు; పెళ్ళిచేసుకోకపోతే నలుగురిలో గౌరవం ఉండదు. అందరూ దొంగముండ అని, గ్రుడ్డి ష్టైటిదనీ తిడతారు. ఛీ అంటారు పెళ్ళయితేనేకాని మగవాడికి అలు

సివ్వకూడదు. దొంగవెధవలు, సరదా తీరాక పురుగును దులిపినట్టు దులిపిపారేస్తారు. సింగడు మరి యిదివరకూ ఏం చేశాడు ? ఎన్ని కబుర్లు చెప్పాడు ? రంగం వెళ్ళిపోదామన్నాడు. సరసాలాడినన్నాళ్ళూ ఆడి తీరా ఓ రోజున మరెవత్తెనో పెళ్ళిచేసుకున్నాడు. తనింకా అప్పుడు చిన్నపిల్ల. ఎంతో ఏడ్చింది. 'ఏంటి యిలా అన్యాయం చేశావ్ సింగా ?' అంటే 'నిన్నెవడు పెళ్ళాడుతాడు నీతిలేనిదానివి' అన్నాడు.

నల్లని ఉంగరాల జుట్టు ఉండాలి. తెల్లగా పొడుగ్గా ఉండాలి. మంచి యిల్లు తోటా ఉండాలి అప్పుడు అబ్బాయి వచ్చి పెళ్ళిచేసుకోవాలి. పెళ్ళిచేసుకుంటేగాని వొంటిమీద చెయ్యి వెయ్యనివ్వకూడదు. తలలో పువ్వులు పెట్టుకొని పెరట్లో పాటలు పాడుతూంటుంది తను. వెనకాతల్తే వచ్చి కళ్ళు మూస్తాడు. చేతులు తీయకుండానే బుగ్గమీద ముద్దు పెట్టుకుంటాడు. తను మళ్ళీ ఆయన మొహాన్ని దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకుంటుంది. తను రోజూ నీళ్ళుపోసుకుంటుంది. ఘుమ ఘుమ లాడే సబ్బుతో వొళ్ళంతా రుద్దుకుంటుంది. బలే వాసన. ఓసారి సుబ్బయ్యగారి అల్లుడు వదిలేసిన సబ్బు ముక్క తెచ్చుకుని నీళ్ళు పోసుకుంది. తన వొంటిని తనకే ముద్దుపెట్టుకోవాలనిపించింది. తన వొళ్ళు కొత్తగా మెత్తగా పట్టుచీరలా మెరిసిపోయింది....

ఒకానొక వేసవిలో ఊరికి దూరంగా ఉన్న ఒక మామిడితోపులో కూర్చుని పగటి కలలుకంటోంది పదిహేడేళ్ళ దాసీ పిల్ల లక్ష్మి. చిరగిన మాసిన బట్టలూ, సంస్కారంలేని చిక్కుబడిన జుట్టూ, ఆమె కళ్ళల్లో ఊహల నిచ్చెనలమీద ఎగబ్రాకే కోర్కెల్ని ఆపలేకపోతున్నాయి. చల్లని పైరుగాలీ, ప్రశాంతమైన మామిడితోటా, యౌవనం కొత్తగా వింతగా అలముకుంటూన్న ఆమె వయస్సూ ఆమె కలల్ని మరింత రెచ్చగొడుతున్నాయి. తాను దిక్కులేని దాసీపిల్లననీ, తన భవిష్యత్తు ఎప్పుడూ యింతేననీ వాస్తవికంగా ఆమె ఆలోచించగలిగితే అప్పుడీ స్వప్నాలవల్ల కలిగే క్షణికమైన మధురానుభూతి కూడా జీవితంలో

లేకుండా చేసుకోవడమే అవుతుందేమో! బతుకు అడుక్కుపోయిన కొలదీ బతకడానికి చేయూత స్వప్నం మాత్రమే కాబోలు. అందరూ అభాగిని అయిన లక్ష్మిలాగ కలలు కంటారు. కాని ఆ కలలు నిజాలౌతాయని నమ్మరు. అక్కడ వాళ్ళు తెలివిగా జాగ్రత్తపడతారు. కాని లక్ష్మిలాంటి అమాయకులూ, ఆవేశహృదయులూ కలల్ని తరుముకుంటూనే పరుగెత్తుతారు. దారిలో గొప్పితగిలేదీ గొయ్యివచ్చేదీ చూసుకోరు. రోగిష్ఠి ఆరోగ్యాన్నిగురించీ, ఆకలితో వున్నవాడు రుచికరమైన పిండివంటల్నిగురించీ, దరిద్రుడు ధనం యిచ్చే సౌఖ్యాన్ని గురించీ ఆలోచించకుండా ఏ చట్టమూ శాసించలేదు. నిజమే. అందుకే భయంకర దరిద్రపీడితులూ, అంగవికలులూ, దుర్భర వ్యాధిగ్రస్తులూ, ఆత్మహత్య చేసుకుని కడతేరకుండా బతుకుతూనే వుంటారు రేపటి సుఖంకోసం.

కళ్ళెంలేనిభావనాప్రపంచంలో విహారంచేస్తూన్నలక్ష్మి తననిఓగంట నుండి నారాయణ అదేపనిగా పరికిస్తున్నాడని గమనించలేకపోయింది. కొంతసేపయాక నారాయణ మెల్లగా ఆమె దగ్గరకు నడచివచ్చాడు. ఛామనచాయగా వున్నాడు. పైజామా తొడిగి తెల్లని గ్లాస్కో చొక్కా వేసుకున్నాడు. కాళ్ళకి నల్లని స్లిప్పర్లు, జుట్టు వెనక్కు దువ్వాడు. పెదవులు ఎర్రగా ఉన్నాయి తాంబూలసేవనంవలన సుబ్బయ్యగారి కొడుకు కన్న, సింగడికన్న ఎంతో బాగున్నాడు. ఇంకా ఎంతో బాగున్నాడు. చదువుకున్నవాడిలా ఉన్నాడు. లక్ష్మికి ఎదురుగావచ్చి నిలుచున్నాడు. లక్ష్మి తల పైకెత్తి చూసింది. ఫక్కున నవ్వింది. ఆమెకి కథలో రాజకుమారుడు నిజంగా వచ్చేసినట్టనిపించింది.

"ఎవరు నువ్వు?" అన్నాడు నారాయణ గంభీరంగా,

"ఏం?" అంది ఓరగా చూస్తూ లక్ష్మి. ఇంకా ఆమెకు పూర్తిగా మెలకువ రాలేదు. వేలినున్న ఉంగరాన్ని ఆప్యాయంగా చూసుకుంటోంది.

"నీ పేరేఁవిటి ?" అడిగాడు నారాయణ.

సన్నగా నవ్వి తియ్యగా చూసింది లక్ష్మి జవాబుగా.

"ఈ తోట ఎవరిదో తెలుసునా ?" ఈసారి కోపంగా అధికారంగా అన్నాడు నారాయణ.

ఉలిక్కిపడింది లక్ష్మి. "మీదేంటి బాబూ. ఊరికినే కూర్చు న్నాను...." భయపడుతూ లేచి నుంచుంది లక్ష్మి.

వీడు తనని పెళ్ళిచేసుకోడానికి రాలేదా ?

నారాయణ గీరగా చూశాడు. అదోవిధంగా దగ్గాడు. లక్ష్మికూడా గమ్మత్‌గా చూసింది. నవ్వింది.

"నీ పేరేఁవిటీ ?" ప్రశ్నించాడు మృదువుగా నారాయణ.

"లచిమి."

"ఈ వూరేనా ?"

"ఉహూఁ పక్క వూరు...."

"ఏం చేస్తూంటావ్ ?"

సందేహంగా కనురెప్ప పైకెత్తి నారాయణను చూసింది. దాసీ దాన్నని చెప్పాలా చెప్పకూడదా అని తటపటాయిస్తోంది.

నారాయణ మీద చెయ్యివేశాడు. జాలిగా అన్నాడు. "పాపం దాసీ పిల్లవా ?"

లక్ష్మి తలూపింది ఔనని.

నారాయణ ఈసారి ఆమె బుగ్గలమీద చేత్తో రాసాడు "మాంచి దానివి."

ఆశగా చూసింది లక్ష్మి !

"అలాగరా-ఆ పక్కకి" అని అర్థవంతంగా నవ్వాడు నారాయణ

"ఎందుకూ?"

"ఇక్కడ అందరూ చూస్తారు."

తెల్లబోయి చూస్తోంది లక్ష్మి.

"డబ్బులిస్తాను, సరేనా, రా."

ఛీ. తన నింత లోకువగా చూస్తున్నాడేమిటి? తనని ప్రేమించానని, పెళ్ళిచేసుకుంటాననీ అనడేం అనుకుంది లక్ష్మి.

"నాను సెడిపోయినదాన్ని కాదు. నా నల్లారాను" అంది లక్ష్మి.

"ఇక్కడ కెందుకొచ్చావు మరి?" కోపంగా అడిగాడు నారాయణ.

"పెళ్ళి చేసుకుందుకు–" అమాయికంగా అంది లక్ష్మి.

"ఎవర్నీ?" అన్నాడు నారాయణ, ఈసారి నారాయణ తెల్లబోయాడు. పెళ్ళిచేసుకునేందుకు మామిడితోపులలోకి రావడమెందుకో? రకరకాల అనుభవంగల నారాయణకే అర్థమవలేదు.

"నాకు నచ్చినవాణ్ణి. డబ్బున్నవాణ్ణి" అంది లక్ష్మి.

నారాయణకి లక్ష్మి ఒక్కసారిగా అర్థమైపోయింది. మెల్లగా కబుర్లలోకి దింపాడు. ఆమె ఊహలు పయనించే త్రోవలేమిటో తెలుసుకున్నాడు. తర్వాత జాలిగా ప్రేమగా అన్నాడు "నన్ను పెళ్ళిచేసుకుంటావా లక్ష్మి?"

"మిమ్మల్నా?"

"అవును"

"నిజంగానే?"

"ఆఁ."

"ఒట్టు?"

"ఒట్టు"

"మరి సింగడిలాగ...."

"సింగడెవడూ?"

"దొంగనా...." లేఖ రెండు మాటలలో సింగడెవడో చెప్పింది లక్ష్మి.

"ఛఛ. నే నలాంటివాణ్ణి కాను. నీలాంటి పిల్లకోసమే చూస్తు న్నాను. నిన్ను, ప్రేమించాను. పెళ్ళిచేసుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను" అన్నాడు నారాయణ.

"నిజం?" పెద్ద కళ్ళలో వెలుగు నిండగా అడిగింది లక్ష్మి.

"ఇంకా నీకు చదువు చెప్పిస్తాను."

"ఓహ్ !"

"డాన్సు నేర్పిస్తాను."

"అబ్బో."

"మరి ఎప్పుడు పెళ్ళిచేసుకుందాం?" అన్నాడు నారాయణ.

"పట్నంలో కాదా పెళ్ళి?" – సీతాలుని జ్ఞాపకం చేసుకుంటూ అడిగింది లక్ష్మి.

నారాయణ ఓ సెకను ఆలోచించి "అవును పట్నంలోనే – నే నక్కడేగా వుండేది" అన్నాడు.

"మీరు పట్నంలో ఏం చేస్తుంటారు?"

నారాయణ చిక్కులో పడ్డాడు. ఈ పల్లెటూరిపిల్ల, అమాయకు రాలూ, రొమాంటిక్ ఊహలూ ఉన్న లక్ష్మికి ఏం చెపితే పని జరుగు తుందో గబుక్కున ఊహించడం నారాయణవంటి చురుకైనవాడికైనా కష్టమే. హోటలులో సర్వర్‌గా, కారు క్లీనరుగా, పిక్ పోకెటర్‌గా, రైలులో మందులమ్మేవాడిగా బహుపాత్రాభినయంచేసిన నటకావతంసుడు.

ఆలోచించి అన్నాడు "మోటార్ డ్రైవర్ని"

"అంటే ?"

"పెద్ద పెద్ద మోటారులూ, లారీలు నడుపుతాను. నే నెలాగ నడు పితే అలాగ వెడతాయి."

"నిజమే ?"

"తెగేసి."

చక్రందగ్గర కూర్చుని మోటార్లు నడిపేవాళ్ళని చూడకపోలేదు లక్ష్మి. కాని నారాయణ చెప్పడంలో, ఈ డ్రైవరు పని అసాధారణ మైనదిగా తోచింది ఆమెకు.

"బాగా డబ్బొస్తుందా ?"

"ఓ, కావల్సినంత. మనం హాయిగా బతకొచ్చును."

లక్ష్మి హాయిగా బతకటాన్ని ఆలోచిస్తోంది.

"నిన్నెప్పుడూ కారుమీద తిప్పుతాను. పట్నంలో కార్లమీద పెద్ద పెద్ద వీధుల్లో ఝూమ్మని పోతూంటే-" అన్నాడు నారాయణ.

కిలకిల నవ్వింది లక్ష్మి. నారాయణ మాటల్లో, సమర్థతలో నమ్మకం చిక్కింది.

సంజ మెరుపులు కళ్ళల్లో కలలకి మరింత విభ్రమాన్ని చేకూర్చాయి.

"మరి ఎప్పుడు పట్నం వెళ్ళడం ?" అంది.

"ఆ ఉంగరం ఎక్కడిది నీకు ?" అన్నాడు నారాయణ లక్ష్మిపై గల శ్రద్ధను విశదపరుస్తూ.

"నాదే.... ఏం ?" బెదురుగా అంది లక్ష్మి.

"అబద్ధం. నా దగ్గర దబాయించకు."

"నాదే నాదే....మరి...."

"నిజం చెప్పు. లేకపోతే పోలీసులొచ్చి జెల్లో పడేస్తారు నిన్ను. నీ కోసమే చెప్తున్నాను. నమ్మవా నన్ను?"

లక్ష్మి సంగతంతా చెప్పింది.

"ఈ ఉంగరం నీ దగ్గరుంటే అపాయం వెర్రిదానా. రేపిపాటికి ఖైదులో వుంటావు. ఈ వుంగరం నా చేతికిచ్చెయ్యి. రాత్రికి రాత్రి కరిగించేసి రూపాయలు తీసుకొస్తాను" అన్నాడు నారాయణ ఆత్రంగా.

"నేను మంచి వోణీ పరికిణీ కొనుక్కుందామనుకున్నాను" దీనంగా అంది లక్ష్మి.

"పిచ్చిదానా, నేను కొని తీసుకొస్తాను. ఈ చిరిగిన బట్టలతో పట్నం వెళ్ళితే నవ్వుతారు"

లక్ష్మి సందేహంగా బెదురుగా బాధగా ఉంగరాన్ని వేలినుంచి మెల్లగా తీసి యిచ్చింది. "మరి పెళ్ళిచేసుకుంటావా!" అంది.

"ఒట్టు వెయ్యలేదూ?"

ఒట్టుయొక్క మహాత్మ్యాన్ని కిమ్మనకుండా అంగీకరిస్తుంది లక్ష్మి.

"మళ్ళీ మీరు ఎప్పుడొస్తారు!"

"ఈ రాత్రికి ఎక్కడో ఒకచోట పడుకో. తెల్లారగానే గుడిదగ్గర వచ్చి వుండు. అక్కడికి నేనువస్తాను. రాత్రి కరిగించేసి అమ్మేసి డబ్బులు తీసుకొస్తాను. ఇద్దరం కలసి రైలెక్కి బొంబాయి వెళ్ళిపోదాం. ఏం?"

"అదేం వూరూ? ఛ, నేను రాను."

"బొంబాయి చాలా పే....ద్ద పట్నం లక్ష్మి."

"సీతాలు మరి చెన్నాపట్నం వెళ్ళిందేం?"

"వెధవ చెన్నాపట్నం! బొంబాయి యింకా గో....ప్ప వూరు. అక్కడ డబ్బు బోలెడు దొరుకుతుంది."

లక్ష్మి ఆలోచించింది. "గుడికాడనే వుంటాను. వస్తారా?"

"తప్పకుండా. వెళ్ళొస్తాను – ఏం?"

లక్ష్మి తలూపింది బెదరుగా. బుగ్గమీద చిటికివేసి గబగబా పొలాలలోంచి నడచి వెళ్ళిపోయాడు నారాయణ. చీకటిపడుతూంటే భయం కలసిన ఆనందంతో కలల మత్తుతో, గుడివైపు నడచింది లక్ష్మి. ఆమెకు ఆకలి వేస్తున్నట్టే అనిపించలేదు.

* * *

ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదికూడా అయింది. ఎండ ఎక్కువైన కొలదీ లక్ష్మికి ఆకలి ఎక్కువౌతోంది. ఎండ చుర్రుమనగానే గుడి దగ్గర రావిచెట్టునీడకి వెళ్ళి కూర్చుంది గుడిగోపురం అంత ఎత్తుగా ఎవరు కట్టారా అని చాలాసేపు ఆలోచించింది. గోపురంమీద ఏదో పక్షి వాలింది. లక్ష్మికి సరదా వేసింది. తనకీ అంతపైన నుంచుని భూమి అన్నివైపులా చూడాలనిపించింది. కొంతసేపు ముసలి రోగిష్టి తల్లి జ్ఞాపకం వచ్చింది. బొడ్డులో తాళాలు దోపుకున్న సుబ్బయ్యగారు కేకలు వేస్తోన్నట్టు అనిపించింది. మధ్య మధ్య అకారణంగా ఉలిక్కిపడింది. గాలిలోంచి ఏదో కమ్మని వాసన వస్తోంటే, లాలాజలాన్ని గుక్కిళ్ళు మింగింది.

పూజారి గవరయ్య ఎవరు నువ్వని అడిగాడు, 'బొమ్మాయి' వెళ్తున్నానని చెప్పింది. నారాయణ ఎటువైపునుండీ రావడంలేదు. తన్ని దగా చేశాడా? గుండె కొట్టుకుంది భయంతో, ఆశాభంగంతో, కాదు, తప్పకుండా వస్తాడు. తన్ని పెళ్ళిచేసుకుంటాడు. ఆ కళ్ళతో ఎంత యిష్టంగా చూసాడు! పల్చని తెల్లని చొక్కానుండి కండలు తిరిగిన వొళ్ళు ఎంత బావుంది. ముట్టుకోవాలనీ ముద్దెట్టుకోవాలనీ అనిపించింది.

కాలవ రేవునుంచి తడిపిన బట్టలతో బిందెలు బుజాన పెట్టుకుని ఆడవాళ్ళు వెళుతున్నారు. గుళ్ళోంచి మంత్రాలు వినపడుతున్నాయి. దేవుణ్ణి తలచుకుని నమస్కరించింది. కళ్ళెత్తి చూసింది. ఎదురుగా సుబ్బయ్యగారు పోలీసుతో, లక్ష్మి కంగారుపడిపోయింది. పారిపోదా మనుకుంది.

"ఆగక్కడ" గద్దించాడు పోలీసు, లక్ష్మి జబ్బపట్టుకున్నాడు.

"ఓసి దొంగముండా, ఇక్కడ తగులడావా, ఇదేం బుద్ధే నీకు? ఏం పొయ్యేకాలం వచ్చింది" అన్నాడు సుబ్బయ్య.

లక్ష్మి వణుకుతూంది.

"ఏదీ ఉంగరం?" వగరుస్తూన్నా సుబ్బయ్యగారు గట్టిగా గొంతు చించుకొని అడిగాడు.

"ఉంగరవేంటీ?" – తన్ని తను కాపాడుకుంటానికి ఒకటే మార్గం అయిన అబద్ధాన్ని ఆశ్రయించింది లక్ష్మి.

"రెండు తన్నండి ముండని" – సుబ్బయ్య సలహా యిచ్చాడు.

పోలీసు లాఠీతో వీపుమీద పొడిచాడు. "అమ్మో" అంది లక్ష్మి.

"చెప్పు ఉంగరం ఏం చేశావు?"

"నాకు తెల్దు – మొరాయించింది లక్ష్మి.

పోలీసు మోకాళ్ళమీద లాఠీతో కొట్టాడు. "బాబోయ్" అని అరచింది లక్ష్మి. ఆమె కళ్ళమ్మట నీళ్ళు ప్రవాహం కట్టాయి. చుట్టూ జనం మూగారు. కొందరు వెకిలిగా నవ్వారు. కొంద రసహ్యించుకున్నారు.

"స్టేషనుకి నడు" అన్నాడు పోలీసు.

మునివేళ్ళమీద నిలబడి చుట్టూ మూగిన జనంలోకీ, జనం అవతలవున్న రోడ్డువైపూ పరకాయించి ఆశగా చూసింది లక్ష్మి. నారాయణ

వస్తున్నాడేమో అని. కాని ఎక్కడా జాడ లేదు. తల్లి జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారిగా పెదపెట్టున ఏడ్చింది. అక్కడ రోడ్డుమీద చతికిలబడి. పోలీసు ఒక పక్క, సుబ్బయ్య ఒక పక్క నడుస్తోంటే దారిపొడుగునా నారాయణ వస్తాడనీ, తనని విడిపిస్తాడనీ ఆశతో కన్నీళ్ళతో చూస్తూనే వుంది.

రెండు నెలలు జైలులో ఉండేటప్పటికి నారాయణ యింక రాడని లక్ష్మికి దృఢమైంది. ఇసుకలాంటి అన్నమూ, చీకటికొట్టులాంటి జైలు గదీ. మనోవ్యథా - లక్ష్మిని నీరసంగా అసహ్యంగా చేసివేశాయి. 'ఉంగరమూ పోయింది, పెళ్ళీ పోయింది' అని గొణుగుకొనేది ఒక్కతే కటకటాల్ని పట్టుకుని. మగవాడి నెవడినీ నమ్మకూడ దనుకుంది. అయినా సుబ్బయ్యగారి కొడుకు ఉంగరం తాను తీస్తే పోలీసుల కెందుకూ బాధ అనిపించింది లక్ష్మికి. వాళ్ళ సొమ్ము ఏమయినా తా నపహ రించిందా ?' లక్ష్మి హేతువుకి ఈ చట్టాలూ మనుష్యులూ అర్థం లేకుండా కనిపించాయి.

రోజూ తెలియకుండా ఏడ్చేది, జ్వరం వచ్చేది. కదలకపోయినా కాళ్ళు లాగేవి. ముసలితల్లి చచ్చిపోయిందేమో అన్న దిగులు. రాత్రుళ్ళు నిద్రలో తనూ నారాయణా 'బొమ్మాయి' వెళ్ళుతూన్నట్టూ, దారిలో రైలు లోంచి తన్ని నారాయణ కిందకి తోసేసినట్టూ తన తల చితికి రక్తం ప్రవహించినట్టూ కలవచ్చి 'బాబోయ్' అని అరుస్తూ లేచి కూర్చునేది.

ఒకరోజున 'లక్ష్మి' అన్న పిలుపు వినబడింది. ఎక్కడా అని తెల్లబోయి గది నలువైపులా చూసింది. ఎవరూ కనబడలేదు. మళ్ళీ 'లక్ష్మి, ఇక్కడ.... నేను' అన్న మాటలు వినిపించాయి. ధ్వని వచ్చిన వైపే చూసింది తన గది నానుకున్న గదిగోడ పగులులోంచి నారాయణ చూసి నవ్వుతున్నాడు.

"నేనూ - నారాయణని లక్ష్మి."

"నువ్వెలాగొచ్చావు ?" ఆశ్చర్యంతో అడిగింది లక్ష్మి.

"నిన్నరాత్రి తీసుకొచ్చారు."

"ఏం ?"

"సైకిల్ షాపులో పనికి కుదిరాను. డబ్బు అవసరం వచ్చి సైకిల్ చక్రం అమ్మేశాను అంతే. పోలీసులు వచ్చి యిక్కడ నన్ను ఉండమని బతిమాలుకొన్నారు" నవ్వుతూ చెప్పాడు నారాయణ.

"బలేగా అయింది సచ్చినోడా-బాగా అయింది" కసితో మెటికలు విరిచింది లక్ష్మి.

"నా కిదేమి కొత్తకాదు పిల్లా. ఇది అయిదోసారి మనం రావడం" అన్నాడు నారాయణ తన ఆధిక్యతను నిరూపిస్తూ.

"మంచిదానివి లక్ష్మి, నీ ఉంగరం అమ్మితే యిరవై రూపాయలొచ్చినై. వారం రోజులు దర్జాగా వెలిగింది మన బతుకు. సినీమాలూ, కాఫీహోటళ్లూ-హాయ్ హాయ్."

"దొంగనాయాల-" తిట్టింది లక్ష్మి.

"నీ తిట్లు నన్ను తగలవు" అన్నాడు నారాయణ.

"అన్యాయం. అన్యాయం చేశావు దొంగసచ్చినోడా. నా ఉసురు నీకు తగుల్తుంది" అంది ఉక్రోషంతో లక్ష్మి.

"ఓష్ ప్రపంచమే అన్యాయం లక్ష్మి. ఎవడికి అవసరమైతే వాడే అన్యాయం చేస్తాడు. మరి నువ్వు దొంగతనం చెయ్యలేదూ ? నీ దగ్గర్నుంచి నేను కొట్టేశాను."

"పో-నీ జిమ్మడా."

"ఎక్కడికీ పోను. ఇక్కడే నీకు సావాసంగా వుంటాను."

లక్ష్మి బాధతో మొహం మరోవైపు తిప్పి కూర్చుంది. నారాయణ నవ్వుతూ అన్నాడు.

"జైలునుంచి విడిచాక వచ్చి నిన్ను తప్పకుండా పెళ్ళిచేసుకుంటా నులే" అంటూ ఫక్కున నవ్వాడు నారాయణ.

లక్ష్మి ఉక్రోషంతో మాట్లాడలేదు.

"అప్పుడు బొంబాయి వెళ్ళిపోదాం. ఏది లక్ష్మి ఇటు చూడు. ఒక ముద్దియ్యి" అంటూ 'ప్చ్' అని పెదవులతో చప్పుడు చేశాడు నారాయణ.

లక్ష్మి దగ్గరున్న నీళ్ళలోటా తీసి పగులువైపు విసిరింది. పెద్ద చప్పుడయింది. పోలీసు 'ఏమిటది' అని కేకవేశాడు. లక్ష్మి మోకాళ్ళ మీద తల ఆన్చి ఏడుస్తోంది. నారాయణ వెకిలినవ్వు జైలుగదిలో కోలాహలంగా ప్రతిధ్వనించింది.

(1961)